

వివరాలు మెయిన్‌లో

వేగంగా ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ


ప్రజాపక్షం

# జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 13 జులై , 2026 | పేజీలు : 5



## కాలం గడిచినా చెరగని పేరు... కామ్రేడ్ ఉజ్జిని నారాయణరావు

పేదల హక్కుల కోసం ఆరు దశాబ్దాల నిరంతర పోరాటం

తెలంగాణ రైతాంగ పోరాటం నుంచి మునుగోడు శాసనసభ వరకు... సిద్ధాంతాలకు అంకితమైన ప్రజానాయకుడి ప్రస్థానం

నేడు చింతపల్లిలో కామ్రేడ్ ఉజ్జిని నారాయణరావు భవన్ నామకరణం...10వ వర్ధంతి బహిరంగ సభ





ప్రజాపక్షం/నల్లగొండ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని జీవితాంతం ఆచరణలో నిలబెట్టిన కమ్యూనిస్టు ఉద్యమ యోధుడు,మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ ఉజ్జిని నారాయణ రావు మరణించి నేటికి పదేళ్లు పూర్త య్యాయి.పేదలు,రైతులు,వ్యవసాయ కూలీలు,భూమిలేని నిరుపేదల హక్కుల కోసం ఆరు దశాబ్దాలకుపైగా అలుపెరగని పోరాటం సాగించిన ఆయన సేవలను స్మరించుకుంటూ నేడు (జూలై 13) చింతపల్లి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయానికి కామ్రేడ్ ఉజ్జిని నారాయణరావు భవన్‌గా నామకరణం చేయనున్నారు.అనంతరం సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఆయన 10వ వర్ధంతి సందర్భంగా బహిరంగ సభ నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లా రాజకీయ,సామాజిక చరిత్రలో కమ్యూనిస్టు ఉద్యమం గురించి ప్రస్తావించిన ప్రతిసారీ గుర్తుకు వచ్చే ప్రముఖ నాయకుల్లో కామ్రేడ్ ఉజ్జిని నారాయణరావు ఒకరు.మూడు పర్యాయాలు మునుగోడు శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజా సమస్యలను శాసనసభలో గట్టిగా వినిపించిన ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారు.

**తెలంగాణ సాయుధ పోరాటమే స్ఫూర్తి**

హైదరాబాద్ సంస్థాన కాలంలో భూస్వాముల దోపిడీ,వెట్టి చాకిరి,అధిక కౌలు వంటి దురాచారాలను ప్రత్యక్షంగా చూసిన ఉజ్జిని నారాయణరావు,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ప్రభావంతో కమ్యూనిస్టు ఉద్యమంలోకి అడుగుపెట్టారు.1948/49 కాలంలో దేవరకొండ ప్రాంతంలో పనిచేసిన కమ్యూనిస్టు పోరాట దళాలకు ఆశ్రయం కల్పిస్తూ,అవసరమైన సహకారం అందించారు.1951లో భారత కమ్యూనిస్టు పార్టీలో చేరిన ఆయన,చివరి శ్వాస వరకు అదే సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా ఉద్యమాల్లో కొనసాగారు. (మిగతా 2లో)





## ఆర్అండ్‌బి శాఖను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రూ.76 కోట్లతో నార్కట్‌పల్లి-మునుగోడు రైల్వే ఓవర్‌బ్రిడ్జికి శంకుస్థాపన

2028 నాటికి ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గం పూర్తి చేసి నార్కట్‌పల్లి ప్రాంతానికి సాగు,తాగునీరు అందిస్తామని హామీ

వివరాలు మెయిన్‌లో




## ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేద్దాం

యువజన ఉద్యమాలను బలోపేతం చేద్దాం

సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదగిరిగుట్టలో మహాసభలు

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి పిలుపు

వివరాలు మెయిన్‌లో

# కాలం గడిచినా చెరగని పేరు... కామ్రేడ్ ఉజ్జిని నారాయణరావు

(మొదటి పేజీ తరువాయి)

**గ్రామాల్లో సంఘటిత పోరాటాలకు శ్రీకారం**

తెలంగాణ సాయుధ పోరాటం అనంతరం పార్టీ బహిరంగ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రైతు, వ్యవసాయ కూలీల సంఘాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు.కామ్రేడ్స్ పల్లా పర్వత రెడ్డి,బొడ్డుపల్లి రామశర్మ,పైడిమర్రి మల్లప్ప తదితరులతో కలిసి దేవరకొండ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేశారు.1952 తొలి సాధారణ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థుల విజయానికి విస్తృత ప్రచారం నిర్వహించి పార్టీ నిర్మాణంలో విశేష కృషి చేశారు.

**దున్నేవాడికే భూమి ఉద్యమంలో ముందుండి...**

1964లో అదనపు శిస్తు విధింపును వ్యతిరేకిస్తూ జరిగిన 60 రోజుల సత్యాగ్రహ పోరాటానికి నాయకత్వం వహించి ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకు ఉద్యమాన్ని కొనసాగించారు.196970లో దున్నేవాడికే భూమి ఉద్యమంలో ముందుండి వేలాది ఎకరాల ప్రభుత్వ,అటవీ,పోరంబోకు,బంచర భూములతో పాటు పోలేపల్లిరాంనగర్ ప్రాంతంలోని అదనపు భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించారు.

**పార్టీ నిర్మాణానికి జీవితాన్ని అంకితం**

1953 నుంచి 1970 వరకు,అనంతరం 1973 నుంచి 1981 వరకు సిపిఐ దేవరకొండ తాలూకా కార్యదర్శిగా పనిచేసి గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేశారు. గడియగౌరారం సింగిల్ విండో చైర్మన్, దేవరకొండ భూతనఖా బ్యాంకు వైస్ చైర్మన్,సమితి కోఆప్షన్ సభ్యుడిగా కూడా ప్రజాసేవ అందించారు.1967,1972 ఎన్నికల్లో మునుగోడు నుంచి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన, 1985, 1989,1994 ఎన్నికల్లో వరుసగా మూడు పర్యాయాలు మునుగోడు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. శాసనసభలో రైతులు,వ్యవసాయ కూలీలు, సాగునీరు, తాగునీరు,విద్య,వైద్యం,గ్రామీణ రహదారులు, విద్యుత్ వంటి ప్రజా సమస్యలను నిరంతరం ప్రస్తావిస్తూ ప్రజల గొంతుకగా నిలిచారు.

**రైతు ఉద్యమాలకు దిక్సూచిగా**

ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా,రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడిగా,దేవాదాయ భూముల సాగుదారుల సంఘం అధ్యక్షుడిగా రైతు సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర సమితి సభ్యుడిగా పార్టీ, ప్రజా సంఘాల బలోపేతానికి అహర్నిశలు శ్రమించారు.పదవులు చేపట్టినా ప్రజలకు దూరం కాకుండా సాధారణ కార్యకర్తలా గ్రామాల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకోవడం, ఎవరు వచ్చినా ఆప్యాయంగా పలకరించడం,కష్టసుఖాల్లో భాగస్వామి కావడం ఉజ్జిని నారాయణరావు వ్యక్తిత్వానికి నిదర్శనం. ప్రజా సమస్యల పరిష్కారమే రాజకీయాల లక్ష్యమని ఆయన నమ్మకం.

**పార్టీ కార్యాలయానికి ఆయన పేరే...**

చింతపల్లి మండలంలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి కామ్రేడ్ ఉజ్జిని నారాయణరావు అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఆ భవనానికి కామ్రేడ్ ఉజ్జిని నారాయణ రావు భవన్ గా నామకరణం చేయాలని సిపిఐ నిర్ణయించింది.ఆయన 10వ వర్ధంతి సందర్భంగా ఈకార్యక్రమం నిర్వహించడం పార్టీ ఆయన పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనంగా నిలుస్తోంది.ప్రజల కోసం జీవించిన నాయకులు కాలం గడిచినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.కామ్రేడ్ ఉజ్జిని నారాయణ రావు అలాంటి అరుదైన ప్రజానాయకుడు.తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమం, రైతాంగ పోరాటాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన నడిపిన ఉద్యమాలు, నిలబెట్టిన విలువలు, ప్రజాసేవా స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తూనే ఉంటాయి.







**బహిరంగ సభకు హాజరుకానున్న సిపిఐ నేతలు:**

సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అధ్యక్షతన జరిగే ఉజ్జిని నారాయణరావు 10వ వర్ధంతి బహిరంగ సభకు సిపిజాతీయ కార్యదర్శి,మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే, కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి,రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ,తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి,రాష్ట్ర సహాయ కార్యదర్శి లు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు,ఈటి నర్సింహా,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్,రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి,ఆందోజు రవీంద్రాచారి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకరరావు,మల్లేపల్లి ఆదిరెడ్డి,ఉజ్జిని యాదగిరిరావు పాల్గొననున్నారు.




# గ్రామానికి పెద్ద... గౌరవానికి అనాథ

**ప్రజాపక్షం/నడిగూడెం:** తెలంగాణ అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రజాప్రతినిధి ఎవరు అంటే ఆ పెద్ద మనిషి సర్పంచ్ మాత్రమే ఒక గ్రామంలో జనన ధృవీకరణ నుంచి మరణ నమోదు వరకు తాగునీటి సమస్య నుంచి పారిశుద్ధ్యం వరకు వీధి దీపాల నుంచి రోడ్ల నిర్మాణం వరకు, సంక్షేమ పథకాల అమలు నుంచి ప్రజల నిత్య సమస్యల పరిష్కారం వరకు ప్రతి విషయంలో ప్రజలు అశ్రయించేది సర్పంచ్‌నే అంతేకాని ఢిల్లీని కాదు, హైద్రాబాద్‌ను కాదు, గ్రామ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య తొలి వారధి సర్పంచ్ . కాని ప్రజలకు అత్యంత చేరువలో ఉండే ఈ ప్రజాప్రతినిధికి దక్కేది అత్యల్ప గౌరవం గుర్తింపు, ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, వీరందరూ ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులే అదే విధంగా సర్పంచ్ కూడా ప్రజల ప్రత్యక్ష ఓట్లతో ఎన్నికవుతాడు. ప్రజాస్వామ్యపరంగా అందరి చట్టబద్ధత ఒక్కటే కాని, వేతనాలు, భత్యాలు, కార్యాలయ సదుపాయాలు, సిబ్బంది, వైద్యభద్రత, పదవి విరమణ తర్వాత పెన్షన్ విషయంలో ఏమాత్రం అకాశానికి భూమికి ఉన్నంత తేడా ఉండి. ఐదేళ్లు గ్రామ ప్రజలకు సేవ చేసిన సర్పంచ్.. పదవికాలం ముగిసిన వెంటనే సాధారణ పౌరుడిగా మిగిలిపోతాడు. ఇది ప్రజాస్వామ్య సమానత్వ సూత్రానికి విరుద్ధం. తెలంగాణలో ప్రస్తుత సర్పంచ్‌కు నెలకు కేవలం 6500 గౌరవ వేతనం మాత్రమే ఉంది. రోజున లెక్కిస్తే 220 కాదు కాదా కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు పర్యవేక్షించే, ప్రభుత్వ పథకాల అమలుకు బాధ్యత వహించే ప్రజాప్రతినిధి శ్రమను ఇంత తక్కువ మొత్తంలో కొలవడం గ్రామ పాలన పట్ల ప్రభుత్వ దృక్పదానే ప్రశ్నిస్తుంది. గోవాలో నెలకు దాదాపు 20వేల వరకు గౌరవ వేతనం అందుతుంది. కేరళలో 15వేలు, పంజాబ్‌లో 12వేల నుంచి 15వేల వరకు, హర్యానలో 10వేలకు పైగా వేతనంతో పాటు ఇతర భత్యాలు కూడా ఇస్తున్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో ఈ రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. అందుకే గ్రామీణాభివృద్ధి సూచికల్లోనూ అవి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయి. ప్రజలకు సమధానం చెప్పాలింది సర్పంచ్ కాని నిధులు, పరిపాలన, అనుమతులు సాంకేతిక ఆమోదాలు, ఆర్థిక స్వేచ్ఛ, మాత్రం అధికారుల చేతుల్లోనే ఉంటున్నాయి. ఫలితంగా బాధ్యతలు సర్పంచ్‌పై అధికారులు మరెవరి చేతుల్లోనే అనే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు సంస్కరణలు అత్యవసరం, సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని కనీసం 15వేల20వేల వరకు పెంచాలని, పదవి కాలం పూర్తి చేసిన వారికి గౌరవ ప్రథమైన పెన్షన్ అమలు చేయాలని, పంచాయతీలకు రాజ్యాంగం కల్పించిన ఆర్థిక పరిపాలన అధికారాలను పూర్థిస్థాయిలో బదిలీ చేయాలి, డిజిటల్ పాలన, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైనఅంశాలపై నిరంతరం శిక్షణ అందించాలని, గ్రామ పంచాయతీలకు కేవలం పథకాల అమలు కేంద్రాలుగా కాకుండా స్థానిక స్వపరిపాలన సంస్థలుగా బలోపేతం చేయాలని, గ్రామ స్వరాజ్యం బలపడాలంటే సర్పంచ్ బలపడాలి. సర్పంచ్ బలపడాలంటే గౌరవం, అధికారాలు, ఆర్థిక భద్రత కల్పించాలి, గ్రామాన్ని గౌరవించేప్రభుత్వమే నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం.

# వైభవంగా బంజారాల సంప్రదాయ శీతల పండుగ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గిరిజనుల అత్యంత పవిత్రమైన, సంప్రదాయమైన శీతల పండుగ వేడుకలు గ్రామీణ ప్రాంతాలలో అత్యంత నయనానందకరంగా సాగాయి. మిర్యాలగూడ మండల పరిధిలోని జంకు తండా గ్రామపంచాయతీ పరిధిలో గల మాలోతు తండాలో ఆదివారం బంజారాల శీతల పండుగను గిరిజన సాంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రకృతి పండుగను పురస్కరించుకుని తండాలోని మహిళలు, చిన్నపిల్లలు సాంప్రదాయ గిరిజన దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. గిరిజన ఆరాధ్య దైవాలైన ఏడు దేవతలైన శీతల భవానీ మాతలకు నైవేద్యాలు సమర్పించేందుకు మహిళలు ఉదయాన్నే ఇళ్లను శుభ్రం చేసుకుని భక్తిశ్రద్ధలతో బోనాలను సిద్ధం చేసుకున్నారు. ఈ వేడుకలలో భాగంగా మహిళలు తలపై బోనాలు ఎత్తుకుని, వివిధ రకాల పిండి వంటలతో తయారు చేసిన నైవేద్యాలను శీతల దేవతల పాదాల చెంత ఉంచి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవత పూజారి జామలానాయక్, శ్రీరాములు, తండా మహిళలు మాలోతు రజిని, సరోజ, హీర, మారోని, పిక్కి, జానీ పాల్గొన్నారు.



## చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎన్నిక

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా చిలుకూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంఘం పాలకవర్గ ఎన్నికలు ప్రశాంతత వాతావరణంలో నిర్వహించగా సభ్యుల మద్దతుతో ఆయన అధ్యక్ష పదవిని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా చిలుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం, సంఘం అభివృద్ధి, సభ్యుల ఆర్థిక పురోగతికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి చేనేత కార్మికుడికి చేరేలా చర్యలు తీసుకుంటానన్నారు. సంఘం బలోపేతం తో పాటు చేనేత ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని చెప్పారు.

## బిజెపి మండల సమావేశం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల బిజెపి మండల సమావేశం ఆదివారం మండల పార్టీ అధ్యక్షులు పింగిలి విజయ్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా మండల ఇంచార్జీ గుజ్జ సోమనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల మురళిధర్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. జిల్లా పార్టీ పిలుపు మేరకు ప్రతి నెల మండల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి, మండలంలోని అన్ని గ్రామాల సమస్యలపై సమగ్రంగా చర్చించి, సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు చెడా నాగయ్య, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, సురేష్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, కార్యదర్శి బాలరాజు, సినియర్ నాయకులు రామచంద్రయ్యాదవ్, బిజేవైఎం అధ్యక్షులు సోమరాజు పాల్గొన్నారు.

## కృషి వలుడు పంచాయతీ కార్యదర్శి

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ సర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎర్రగట్టు తండా గ్రామంలో ఆదివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి వీరారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్‌కె మోషిన్ పాల్గొని గ్రామస్తులకు సర్ ప్రక్రియపై వివరించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ సర్ ఫారం అందుకున్న ప్రతి అర్హత ఉన్న ఓటర్ తప్పనిసరిగా ఫారాన్ని పూర్తి వివరాలతో నింపి ఓటర్ తప్పనిసరిగా ఫారాన్ని పూర్తి వివరాలతో నింపి సంబంధిత అధికారులకు నిర్ణీత గడువులోగా సమర్పించాలని కోరారు. ఫారం సమర్పించకపోతే ఓటర్ జాబితాలో పేరు కొనసాగడంపై ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా ఈ ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఓటర్ తన హక్కును పరిరక్షించుకోనేందుకు సర్ ప్రక్రియ విజయవంతం చేయాలని సర్పంచ్, కార్యదర్శి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.



## రాజేందర్‌రెడ్డిని అభినందించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** నల్గొండ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన మేకల రాజేందర్‌రెడ్డి ఆదివారం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్‌ను స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎంఎల్ఏ ఆశీస్సులు తీసుకున్నారు. తన నియామకం పట్ల సహకరించిన ఎంఎల్ఏ బాలునాయక్‌కు రాజేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్ఏ బాలునాయక్ రాజేందర్‌రెడ్డిని అభినందించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ క్రమ శిక్షణతో పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా అందరిని కలుపుకొని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాజేందర్‌రెడ్డికి సూచించారు. భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు



చేరవయ్యేటట్లుగా పనిచేసే క్షేత్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. సర్ ప్రక్రియలో ప్రజలను చైతన్యవంతం చేసి అర్హులైన వారికి ఓటు హక్కు వచ్చేలా చూడాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎలిమినేటి సాయి, కేసాని రాజు, దుగ్గి వెంకన్న, నారోజు సైదాచారి, మురళి కృష్ణ, పసునూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధితో ప్రయాణికుల హర్షం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం సీసీ రోడ్డుతో అందంగా అభివృద్ధి చేయబడటంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్త సీసీ రహదారి వల్ల బస్సుల రాకపోకలు సులభతరమవడంతో పాటు ప్రయాణికులకు కూడా ఎంతో సౌకర్యవంతంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.అయితే బస్టాండ్‌లో ఇప్పటికే నిర్మించిన ఆధునిక మూత్రశాలలు, మరుగుదొడ్లు ఇంకా ప్రజల వినియోగానికి అందుబాటులోకి రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా మహిళా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. వెంటనే వాటిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.ఇదిలా ఉండగా బస్టాండ్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అలాగే మర్రిగూడ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి మంజూరైన రూ.3 కోట్ల నిధులను సమర్థవంతంగా వినియోగించి, బస్టాండ్ వెనుక ఉన్న దాదాపు ఎకరం స్థలంలో సగభాగాన్ని ఫంక్షన్ హాల్ లేదా ప్రైవేట్ విద్యాసంస్థలకు లీజుకు ఇవ్వడంతో పాటు,మిగిలిన సగభాగాన్ని ద్విచక్ర వాహనాల పార్కింగ్ (బైక్ స్టాండ్)గా అభివృద్ధి చేయాలని గ్రామ సర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,ప్రజలు కోరుతున్నారు.

## హోటల్ యజమానులు ఐకమత్యంతో పనిచేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట హోటల్ యజమానులు ఐక్యమత్యంతో పనిచేస్తూ అసోసియేషన్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సూర్యాపేట హోటల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ బలంగా ఉన్నప్పుడే హోటల్ యజమానుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాలని కోరారు. పట్టణ హోటల్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా పానుగంటి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా చీర్యాల నరేష్, కోశాధికారిగా వనం మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా రమేష్ శెట్టి,



లతీఫ్, ప్రచార కార్యదర్శులుగా రాము, దయాకర్, గిరి, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షులు జానకిరాములు అధ్యక్షతన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి రామమూర్తి, కమిటి సభ్యులుగా సాంబయ్య, ప్రవీణ్, బాబా, పవన్, సుధా కిషోర్, వెంకటేశ్వర్లు, సాయి, లక్ష్మ ణ్, లింగం, రాఘవశెట్టి, సైదులు, హరిప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకోసం ఎదురుచూపులు

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వేయిలాదిమంది అర్హులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలకు మంజూరైన ఇళ్ల మంజూరు ప్రక్రియ ఇప్పటికీ స్పష్టంగా రాకపోవడంతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. ప్రస్తుతం మండలంలోని లకారం గ్రామంలో మాత్రమే పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగతా గ్రామ పంచాయతీలో ఇళ్ల మంజూరు నిర్మాణం ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ప్రకటించిన విధంగా ఎల్1, ఎల్2, ఎల్3 కేటగిరి వారిగా అర్హుల జాబితాలను ఖరారు చేసి విడతల వారిగా నిర్మాణం చేపడతామని అధికార పార్టీ నాయకులు పలుమార్లు ప్రకటించారు. అయితే నేటి వరకు జాబితాపై అధికారికంగాఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో అర్హులు నిరీక్షణలో ఉన్నారు. గ్రామాల్లో సర్వేలు పూర్తయినప్పటికీ తుది జాబితాలు ప్రకటించకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు.




ముఖ్యంగా మండలంలోని పలు గ్రామాలో అధికార పార్టీకి చెందిన రెండు, మూడు వర్గాలు ఉండటంతో ఒక వర్గం నుంచి వేరు వేరు వర్గం అర్హుల జాబితాలను ఎమ్మెల్యే వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో జాబితానుపరిగణలోకి తీసుకోవాలని అంశంపై గందరగోళం నెలకొన్నట్లు సమాచారం, ఈ నేపథ్యంలో అన్ని వర్గాల నాయకులు కలిసి ఒకే జాబితా సిద్ధం చేసి పంపించాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిసింది.

## ఓట్ల తొలగింపుపై అప్రమత్తం

**ప్రజాపక్షం/నూతనకల్ :** దేశంలో సర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఓట్ల తొలగింపు కుట్రపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిపిఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుంచి లక్షల మంది ఓట్లను తొలగించే కుట్రను అడ్డుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రత్యేక ఓటరు నమోదు పేరుతో ఇప్పటికే బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను తొలగించారని అన్నారు. ఈ సమావేశంలో వెంకట్ రెడ్డి, నారాయణ, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, రాములయ్య, సైదులు పాల్గొన్నారు.

## ఉచిత ఎముకల వైద్య శిబిరానికి స్పందన



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఎముకల వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆదివారం బోధిధర్మ యోగ అండ్ అసోసియేషన్ అధ్యక్షులు సీత భాస్కర్, సభ్యుల ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎమ్మెస్ విశ్వనాథ్ రాజేశ్వరి నర్సింగ్ హోమ్ సౌజన్యంతో నిర్వహించిన ఈశిబిరంలో 200 మంది పట్టణ, మండల ప్రజలకు ఉచిత పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫిజియోథెరపీ డాక్టర్. ప్రదీప్ ఫిజియోథెరపీకి సంబంధించిన సూచనలు చేశారు. ఉపాధ్యక్షులు కడవేరు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చింతల రామకృష్ణ, సహాయ కార్యదర్శులు దోర్నాల బాలరత్నం, రణం రాజశేకర్, కోశాధికారి కొండమడుగు మల్లేష్, సంస్కృతిక కార్యదర్శి వనం వెంకటేష్, కార్యవర్గ సభ్యులు దోర్నాల బాలరాజు, బావండ్ల రాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సమర్థవంతంగా సర్ ప్రక్రియ



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని రామాపురం 34, 35 పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ దరఖాస్తుల స్వీకరణ అంశాలను తహసిల్దార్ సైదులుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియను బిఎల్‌వోలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఓటు నమోదు ప్రక్రియ మార్పులు చేర్పులు తొలగింపులు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియను వేగవంతంచేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసిల్దార్ మౌనిక, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ, అధికారులు, ప్రజాప్రతినిధులు, బిల్ వోలు పాల్గొన్నారు.

## హాలియా సిఐగా రాఘవరావు

**ప్రజాపక్షం/హాలియా :** హాలియా సీఐగా రాఘవరావు ఆదివారం బాధ్యతను స్వీకరించారు.ఇక్కడ సిఐగా పనిచేసిన సతీష్ రెడ్డి చౌటుప్పల్ సిఐగా బదిలీపై వెళ్లారు. నల్గొండ టూ టౌన్ సిఐగా పనిచేస్తున్న రాఘవరావు హాలియాకు బదిలీపై వచ్చారు. మల్టీ జోన్ 2ఐజి ఉత్తర్వుల మేరకు ఆయన హాలియా సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బదిలీపై వచ్చి ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు.ఈ సందర్భంగా సిఐ రాఘవరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని తెలిపారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటారని తెలిపారు.



## మదన్ మోహన్ మృతికి నివాళులు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ పట్టణానికి చెందిన మదన్ మోహన్ (అడ్వకేట్) గ అనారోగ్యంతో మృతి చెందగా వారి మృతదేహానికి వేరువేరుగా ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం , తెలంగాణ ఉద్యమ నేత టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ చెరుకుసుధాకర్,టిపిసిసి ప్రధాన కార్యదర్శి దైదరవీందర్,పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పూజార్ల శంబయ్య , నోముల గోవిందరాజులు,దోడ సోమయ్య,నాయకులు లింగాల వెంకన్న,గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లాలు నాయక్‌కు సన్మానం



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడు లాలు నాయక్‌ను ఆదివారం గ్రామ సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి,ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మండల బాధ్యతలు అప్పగించిన నాగార్జునసాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నెల్లికల్ గ్రామ సర్పంచ్ వట్టాల శ్రీను,సపావత్ తండా సర్పంచ్ బిక్కు నాయక్, సుంకిశాల తండా సర్పంచ్ శ్రీను నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా లింగయ్య నాయుడు



**ప్రజాపక్షం/నిడమనూరు:** నిడమనూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఆంధ్రజ్యోతి విలేకరి, సీనియర్ జర్నలిస్టు దోసకాయల లింగయ్య నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా లింగయ్య నాయుడుతో పాటు ప్రధాన కార్యదర్శిగా అట్టెం రవి,గౌరవ అధ్యక్షుడిగా దోరేపల్లి ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడిగా పోతుగంటి శ్రీనివాస్,కోశాధికారిగా చిం్ర ప్రసాద్(ప్రజాపక్షం), కార్యదర్శిగా దోరేపల్లి నాగరాజు , కార్యవర్గ సభ్యులుగా నల్లమోతు శివ , రామడుగు రామ్మూర్తి , బొంగరాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లింగయ్యనాయుడు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని....



**ప్రజాపక్షం/పాలకవీడు:** సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుబిక్షంగా పాడి పంటలతో తుల తూగాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ ఆదివాసి కాంగ్రెస్ కమిటి రాష్ట్ర చైర్మన్ శంకర్ నాయక్ ఆకాక్షించారు. ఆదివారం పాలకవీడు మండలం కల్మెటతండా గ్రామంలో గిరిజనులకే ప్రత్యేకమైన శీత్లా పండుగ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి గిరిజనులతో కలిసి సందడి చేసిన సందర్భంగా మాట్లాడారు. తెలంగాణలోని బంజార గిరిజనుల ఏటా జూలై నెలలో అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రకృతిని , శీతలభవాని ఆరాందించే పండుగే శీత్లా పండుగ అని అన్నారు. పాడి పంటలు, పశువులు, కుటుంబాలు అంటు వ్యాధులు, వేసవితాపం నుండి చల్లాగా ఉండాలని కోరుకుంటూ ఈ పండుగను జరుపుకుంటారని అన్నారు. గిరిజన మహిళలు, జిల్లా కాంగ్రెస్‌ప్రదాన కార్యదర్శి మాలోతు మోతిలాల్ నాయక్, ఎస్‌వి సుబ్బారావు, భూక్యగోపాల్, భూక్య చరణ్‌లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించార. అనంతరం సంప్రదాయ ప్రకారం నృత్యాలు చేసి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జాన్‌పహడ్ సర్పంచ్ కవితకిరణ్‌నాయక్, నాయకులు నాగరాజు, రాము, శోభన్, సైదా, వీరన్న పాల్గొన్నారు.

## కెటిఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



**ప్రజాపక్షం/కోదాడ:** 14 సంవత్సరాలు అలుపెరగని పోరాటం చేసి సబండ వర్గాలను ఏకం చేసి రాష్ట్రాన్ని సాధించిన మహానేత కెసిఆర్ అని ఉద్యమనేతలు హరిష్ రావు, కెటిఆర్‌పై జరుగుస్సాకర వ్యాఖ్యలు చేసి దగుల్బాజీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తక్షణమే భర్తీ చేయాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం కోదాడ బస్టాండ్ ఎదుల ప్రధాన రహదారిపై ముఖ్యమంత్రి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వందలాదిమంది బిఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం దోపిడి రాజ్యం, దొంగల రాజ్యం, రేవంత్ హఠావో, తెలంగాణ బచావో అంటూ పెద్ద పెట్టున పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ ముగ్గురు నేతలనే కోసి రక్తంతో పంటలను తడపాలని హేయంగా దుర్భాషలాడిన రేవంత్‌రెడ్డి నాలుక కోసి కారం పెడితేనే పాప పరిహారం అవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రం అన్ని రంగాలలో అధోగతిపాలై కుక్కలు చింపిన విస్తరిలా తయారైందని, ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఇదేమీటని ప్రశ్నించిన ప్రతి వర్గాన్ని వీధి రౌడిలా బెదిరిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ఈ ధర్నాలో మండల పట్టణ బాధ్యులు తోగరు రమేష్, సుంకర అజయ్‌కమార్, ప్రదీప్, శివాజీ, జానకిరామ చారి, తాళ్లూరి శ్రీను, నర్సిరెడ్డి, అంజనేయులు, శీలం సైదులు, ఏలూరు వెంకటేశ్వర్లు, యుగందర్‌రెడ్డి, అప్పారావు, ఎస్‌కె నయీం, చీమ నరేష్, తుమ్మలపల్లి బాస్కర్, ఉపేందర్‌గౌడ్, చలిగంటి వెంకట్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

## చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ఏకలవ్యుడు




**ప్రజాపక్షం/నాంపల్లి:** సంకల్పం, పట్టుదల, గురుభక్తితో చరిత్రలో ఏకలవ్యుడు చిరస్థాయిగా నిలిచిపోయాడని,అతని జీవితం ప్రతి ఒక్కరికీ గొప్ప స్ఫూర్తిదాయకమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు.మండలంలోని గానుగుపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఏకలవ్యుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ లక్ష్యం ఉంటే మార్గం దొరుకుతుందని, అవకాశాలు లేకపోయినా ప్రయత్నాన్ని ఎన్నటికీ ఆపకూడదని ఏకలవ్యుని జీవితం చాటిచెబుతుందని పేర్కొన్నారు.మునుగోడు నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రైతులకు యూరియా ఎరువును అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కన్వీనర్ గుమ్మడపు నరసింహారావు,ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలుగు శంకర్,నాంపల్లి,తుంగపాడు,రేఖ్యతండ గ్రామాల సర్పంచులు నక్క శేఖర్,కడారి శ్రీశైలం యాదవ్, నడింపల్లి యాదయ్య పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతులను నొక్కేందుకే ‘ఉపా’ చట్టాల ప్రయోగం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నిజాలను నిర్భయంగా మాట్లాడే జర్నలిస్టులు, యూట్యూబర్లపై అక్రమ చట్టాలను ప్రయోగించి ప్రజాస్వామ్యాన్ని బలిచేయడం సరికాదని వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ యూట్యూబర్ ప్రశ్న రావణ్ పై ఏపీ ప్రభుత్వం పెట్టిన ఉపా అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఎన్ఎస్పి క్యాంపు ఏరియాలో గల తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం సాయంత్రం ఒక భారీ నిరసన ప్రదర్శనను చేపట్టారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపానికి నివాళులర్పించిన అనంతరం ప్రజాస్వామ్యవాదులు నల్లబ్యాడ్జీలతో తమ నిరసనను వ్యక్తపరిచారు. ఈ ఆందోళన సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే యూట్యూబర్స్, స్వతంత్ర జర్నలిస్టులను టార్గెట్ చేస్తోందని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో నిర్బంధ వ్యతిరేక కమిటీ రాష్ట్ర కన్వీనర్ రవిచంద్ర, ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ బి.రామయ్య, ప్రజాసంఘాల ప్రతినిధులు డాక్టర్ జె.రాజు, సత్యనారాయణరావు, జ్వాలా వెంకటేశ్వర్లు, కుందా శ్రీనివాస్, నారాయణరెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వరుణ దేవుడికి రైతుల మొర....



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** సరైన వర్షాలు కురవకపోవడంతో రైతన్నలు ఆశతో ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. మేళ్లచెరువులోని రైతన్నలు అరకొర వర్షాలను నమ్ముకుని చేలలో పత్తి విత్తనాలను విత్తుతున్నారు. మరల పడతాయి అన్న ఆశతో పత్తి విత్తనాలను సాగుచేస్తే ఆశించిన స్థాయిలో వర్షాలు పడక విత్తనాలు సరిగా మొలకెత్తక ఆర్థికంగా నష్టపోయారు. ఎకరానికి 20వేల రూపాయల చొప్పున ఖర్చుపెట్టి విత్తనాలు సాగుచేస్తే అవి మొలకెత్తకపోవడంతో మరల అదే ఖర్చుతో పంటను వేశారు. గ్రామంలోని యువకులు, పెద్దలు కలిసి 101 బిందెలతో నీటిని తోడి గ్రామ శివారులోని పంట పొలాల మధ్యతో ఉన్న జోగి రాయుడు స్వామి దేవాలయంలోని స్వామివారికి అత్యంత భక్తి శ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించారు.

## శివచరణ్ రెడ్డిని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** యాదాద్రి లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలుగా నియమితులైన 82 ఏళ్ల వృద్ధురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేసిన అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలను తెలంగాణ యాదవ, బీసీ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. శ్రీకృష్ణ యాదవ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పుట్టా వీరేష్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో ఆదివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఒక బీసీ బిడ్డకు, అందులోనూ ఎంతో అనుభవం ఉన్న ఒక వృద్ధురాలికి ముఖ్యమంత్రి స్వయంగా గౌరవించి పదవి ఇస్తే, దాన్ని తట్టుకోలేక ఒక వర్గం వారు ప్రదర్శిస్తున్న ఆధిపత్య, భూస్వామ్య నైజానికి ఈ ఘటనే సజీవ సాక్ష్యమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం సలహాదారులు నక్కల చిరంజీవి యాదవ్, దేశ బోయిన సూర్యనారాయణ యాదవ్, వడిచర్ల కృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులు గుండబోయిన సురేష్ యాదవ్, దశరథ యాదవ్ పాల్గొన్నారు.

## రూ.26వేలు కనీస వేతనం అమలు చేయాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి సలీం, రాష్ట్ర కమిటీ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆది వారం నకిరేకల్‌లోని కేఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన రెండు రోజుల సీఐటీయూ జిల్లా శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా వారు మాట్లాడారు.ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆగస్టు 9 క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న మండల,జిల్లా కేంద్రాల్లో నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతులకు ఆసంఘం జిల్లా ఉపా ధ్యక్షుడు లకపాక రాజు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈకార్యక్ర మంలో జిల్లా కోశాధికారి బి. ప్రమీల, జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్యపాల్గొన్నారు.

## పట్టువస్త్రాల అలంకరణ

**ప్రజాపక్షం/రామన్నపేట :** బోగారం గ్రామానికి చెందిన గుంజే శివ,సమ్మక్క దంపతుల ముద్దుల కుమార్తెల నూతన పట్టు వస్త్రాల అలంకరణ మహోత్సవ కార్యక్రమానికి బోగారం గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ అంతటి పద్మ రమేష్ గౌడ్ హాజరై చిన్నారులను ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గుంజే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



## సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/చివ్వెంల :** ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఐలాపురం గ్రామంలో కోట సుప్రజ కిరణ్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. నియోజక వర్గంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి రూ.5లక్షలు మంజూరి చేయించి సొంతింటి కల సాకారం చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, నాయకులు చింతమళ్ళ రమేష్, సామ బాల్‌రెడ్డి, బోడపట్ల సునీత శ్రీను, బోయిల్ల వెంకటరమణ, దేశబోయిన రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి జాతర



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని కాపుగల్లు గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీగంగమ్మ తల్లి జాతర భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొంతగాని అప్పారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా యాదవ మహిళలు సాంప్రదాయబద్ధంగా జలబిందెలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని గంగమ్మ తల్లికి జలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## కృతజ్ఞతలు తెలిపిన రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట నియోజకవర్గాన్ని పునర్విభజనలో ఏర్పాటు చేయుటకు, రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని వందపడకలుగా చేయుటకు నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేసిన రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి, ఎమ్మెల్యే వీరేశంకి రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి గౌరవ అధ్యక్షులు రెబ్బస్ రాములు, అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్ గౌడ్, కార్యదర్శి గడ్డం యాదగిరి, ఎండి ఫజల్, పెండం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ గృహాలతో పేదల సొంతింటి కల



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తవుతున్నాయి. మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్ నగర్ ప్రాంతానికి చెందిన లబ్ధిదారు బొల్లా ఉపేందర్ రెడ్డి, దామరచర్ల మండల పరిధిలోని మంగళ్ దుబ్బ తండా నివాసితులు భూక్య లక్ష్మి, తాళ్ళపల్లి లాజర్, కేజేఆర్ కాలనీకి చెందిన ధనావత్ కవిత, దానవత్ కమిలి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. తోరణాలు కట్టిన నూతన గృహాల వద్ద లబ్ధిదారుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి ఈ ఇళ్లను ప్రారంభించారు. నూతన గృహాల ప్రారంభోత్సవం అనంతరం శాసనసభ్యులు ప్రతి ఇంటా అడుగుపెట్టి అక్కడి కుటుంబ సభ్యులతో ఎంతో ఆత్మీయంగా ముచ్చటించారు. కొత్త ఇళ్లలోకి ప్రవేశించిన పేద కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజలకు ఆత్మగౌరవంతో కూడిన నివాస వసతి కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని నియోజకవర్గంలో విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఎక్కడా దళారుల ప్రమేయం లేకుండా, అర్హత ఉన్న ప్రతి ఒక్క పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లాభాలు నేరుగా అందేలా పాలనా యంత్రాంగం కట్టుబడి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కల్యాణ మండపం అధ్యక్షులుగా మీలా మహదేవ్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులుగా మీలా మహదేవ్ ఏకగ్రీవంగా మళ్ళీ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కమిటి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2026 నుండి 2028 వరకు 2 సంవత్సరములకు గాను పలువురు ఏకగ్రీవంగా మీలా మహదేవ్‌ను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట ఆర్యవైశ్య కళ్యాణ మండపం మిగతా కమిటి త్వరలో ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సుమారు రూ.50లక్షలతో ఆర్యవైశ్య కళ్యాణ మండపం అన్ని హంగులతో రూపుదిద్దుకుంటున్నట్లు తెలిపారు. నూతన నిర్మాణానికి సుధాకర్ పివిసి రూ.10లక్షల విరాళం, అనంతుల జనార్ధన్ కుటుంబ సభ్యులు రూ.15లక్షల, మీలా మహదేవ్ కుటుంబ సభ్యులు రూ.15లక్షలు, ఆర్యవైశ్య కళ్యాణ మండప కమిటి సభ్యులు రూ.10లక్షలు ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. ఇప్పటికే విద్యుత్ అలంకరణ, ఏసిలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం మాజీ ప్రధాన కార్యదర్శులు కొత్త ఆంజనేయులు, రాచర్ల కమలాకర్, స్వామి బుచ్చయ్య, కమిటి సభ్యులు గజ్జల జనార్ధన్, కుక్కడపు శ్రీనివాస్, స్థల దాతలు వెంపటి లక్ష్మి కాంతారావు, కిరణ్, పూర్ణచందర్, సభ్యులు గుడిపాటి నాగేశ్వరరావు, బ్రహ్మదేవర వెంకన్న, చల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మిర్యాలగూడ బాలుడు కొర్ర హనీష్‌కాంత్




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** క్రీడల్లో రాణించేందుకు వయస్సుతో సంబంధం లేదని నిరూపిస్తూ మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఒక చిన్నారి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై తన నైపుణ్యాన్ని చాటుకున్నాడు. హైదరాబాద్ నగరంలోని గౌడియం స్కూల్ వేదికగా అత్యంత ఉత్సాహభరితంగా సాగిన 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్స్ మరియు జూనియర్స్ బాలబాలికల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2026 పోటీలలో మిర్యాలగూడకు చెందిన కొర్ర హనీష్ కాంత్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. సబ్ జూనియర్ అండర్8 విభాగం కింద నిర్వహించిన 60 మీటర్ల పరుగుపందెంతో పాటు స్టాండింగ్ జంప్ క్రీడాంశాలలో తను ఎంపికై ఈ పోటీలలో పాల్గొన్నాడు. జూలై 12వ తేదీన హైదరాబాద్ గౌడియం స్పోర్టోపియా వేదికగా ఈ క్రీడా సంబరాలు జరిగాయి. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చాటిన హనీష్‌కాంత్ పట్టణ నివాసితులైన కుర్ర కృష్ణ కాంత్‌నాయక్ ప్రభుత్వ ఉపాధ్యాయులు, కాంతి దంపతుల కుమారుడు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ కోచ్ సతీష్ మాట్లాడుతూ హనీష్‌కాంత్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి క్రీడలలో రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. నిరంతరం క్రీడల్లో మరింత కృషిని కొనసాగిస్తూ జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి, పుట్టిన గడ్డ మిర్యాలగూడకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోచ్ సతీష్, క్రీడాకారుడు కొర్ర హనీష్ కాంత్, తల్లిదండ్రులు కుర్ర కృష్ణ కాంత్ నాయక్, కాంతి పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మున్సిపాలిటిలో ప్రతి వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. ఆదివారం పట్టణంలోని 16వ వార్డులో నూతనంగా సిసి రోడ్డు నిర్మాణానికి వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. వార్డుల్లో సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో అధిక నిధులు తీసుకవచ్చి అన్ని రంగాల్లో మున్సిపాలిటిని అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ జహీర్, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాయకులు అబ్దుల్ రహీం, ధరావత్ వీరన్న నాయక్, అభినయ్ నాయుడు,పాల్గొన్నారు.

## హేమచందర్ సేవలు ఆదర్శప్రాయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** చకిలం హేమచందర్ దాదాపు 30 సంవత్సరాల పాటు జూనియర్ లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా, ఇంటర్ బోర్డు డిప్యూటి సెక్రటరీగా అందించిన సేవలు ఆదర్శప్రాయమని ఇంటర్ విద్యా జెఏసి చైర్మన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో చకిలం హేమచందర్ ఉద్యోగ విరమణ సన్మానోత్సవ కార్యక్రమంలో వారు హాజరై మాట్లాడారు. హేమచందర్ తన పదవీ కాలంలో వేలాది మంది విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి విశేష సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ పెరుమాళ్ల యాదయ్య, శాగంటి శ్రీనివాస్, చిత్రం యాదగిరి, భాను నాయక్, యర్ర అంజయ్య, సులోచనరాణి పాల్గొన్నారు.

## కార్మికులపై వేధింపులను ఆపాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులపై రాజకీయ కక్ష సాధింపులు అక్రమ తొలగింపులను వెంటనే అరికట్టాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ డిమాండ్ చేశారు .ఆదివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో నోముల వసంత అధ్యక్షతన ఆసంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు పథకంలో పనిచేస్తున్న కార్మికులపై బెదిరింపులతో, కక్ష సాధింపులు చేస్తూ ఏ కారణం లేకుండా అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నారనీ అనేక సంవత్సరాల నుంచి నెలల తరబడి బిల్లులు వచ్చిన రాకున్నా శ్రమకు ఓర్చి పని చేస్తున్న కార్మికులపై ప్రజా పాలనలో కక్ష సాధింపులు తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నకిరేకల్ మండల కన్వీనర్ ఒంటెపాక వెంకటేశ్వర్లు, వెంకటమ్మ రేణుక సైదమ్మ పాల్గొన్నారు.

## ఓటు నమోదు పై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని అన్నప్పరెడ్డిగూడెం వేములపల్లి బుగ్గబాయి గూడెం గ్రామాలలో జరుగుతున్న ఓట్ల నమోదును తిరును కిసాన్ మోర్చ జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల నమోదులో అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కు నమోదు చేసేలా బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మం డల అధ్యక్షుడు పెదమం భరత్,జవాజి సత్యనారా యణ, పెదమం వెంకన్న, జాన్ రెడ్డి,పైడిపల్లి సోమయ్య, కోట్ల శంకర్ రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.